క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై ఉన్న 33 కేవీ ఫీడర్ మరమ్మతు కారణంగా ఆదివారం పట్టణంలోని టౌన్–2 పరిధిలో ఉదయం 6 నుంచి 10 వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ పట్టణ ఏడీ తావుర్యానాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దాం



జడ్చర్ల: కార్మిక చట్టాలు, హక్కుల పరిరక్షణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 20న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక అంబేడ్కర్ కళాభవనం వద్ద సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లుగా మార్చి కార్మికుల హక్కులను హరించిందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకటేశ్, మహేశ్, అలివేలు, దేవమ్మ, కృష్ణ పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటా



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉమ్మడి జిల్లా ప్రజలకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని పీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం హర్షవర్ధన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు కేవలం ఉపాధ్యాయుల సమస్యలపైనే పోరాటం చేశానని, ఇక నుంచి అన్నివర్గాల ప్రజల తరఫున పోరాడుతానని చెప్పారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో పీసీసీ నాయకుడు ఎన్పీ వెంకటేశ్, పీఈటీల సంఘం నాయకులు నిరంజన్, ఆనంద్ ఉన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



మహబూబ్‌నగర్ రూరల్: ఎరుకల నాంచారమ్మ వార్షిక కల్యాణ మహోత్సవ వాల్‌పోస్టర్‌ను శనివారం జిల్లాకేంద్రంలో తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు లాల్‌కోట శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమవారం యాదాద్రి జిల్లా భువనగిరి భూదాన్ పోచంపల్లి మండలం పిరాయిపల్లిలో జరిగే ఎరుకల నాంచారమ్మ జాతరకు ఉమ్మడి జిల్లా నుంచి ఏకలవ్య వారసులు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోనెల శ్రీనివాస్, భీమయ్య, సాయిలు, తిరుపతయ్య, గొల్లపల్లి రాములు, కృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా చూడాలి



వనపర్తి: గెలుపోటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించి, క్రీడల్లో అద్భుతమైన ప్రతిభ కనపర్చాలని వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శనివారం పెబ్బేరు మండలం కంచిరావుపల్లిలో భూదేవి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. అంతకుముందు ఆలయంలో జరుగుతున్న ఉత్సవాలకు హాజరైన ఎస్పీ దేవాలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్ణ కుంభంతో స్వాగతం పలికి స్వామివారికి పూజా కార్యక్రమం నిర్వహించి ఎస్పీని సన్మానించారు. సాంప్రదాయ నృత్యాలతో భక్తులను అలరించిన మహిళలను అభినందించి 2వేల నగదు బహుమానం అందజేశారు. అనంతరం ఉమ్మడి తెలుగు రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను ప్రారంభించారు. అనంతరం టాస్ వేసి ఇరుజట్ల క్రీడాకారులను కరచాలనం చేసి ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వెంకటేశ్వర్‌రెడ్డి, తేజవర్ధన్, గోపాల్, నీలవరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణయ్య, భాస్కర్, శ్యాంసుందర్, రాము, బాలగౌడ్, సోమగౌడ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకు గుర్తుగా సేవ

- సామాజిక సేవలో అమ్మ సేవాసమితి, అమ్మ ఎడ్యుకేషన్ సెంటర్
- అమ్మ పేరునే ఏర్పాటుచేసిన పడాల జగదీశ్వర్
- ఆయన లేకున్నా.. నేటికీ కొనసాగుతున్న సేవలు



అమ్మ సేవాసమితి ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ (ఫైల్)

జడ్చర్ల టౌన్: బొమ్మను చేసి ప్రాణం పోసి పేగు తెంచి రక్తం పంచి బతుకునిచ్చేది అమ్మ.. బతకడం నేర్పేది అమ్మ. మాతృ దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని అమ్మ సేవాసమితి, అమ్మ ఎడ్యుకేషన్ సెంటర్ గురించి తెలుసుకుందాం. పట్టణానికి చెందిన పడాల జగదీశ్వర్ తల్లిదండ్రులు పడాల జంగయ్య, సాయమ్మ చిన్నతనంలోనే చనిపోయారు. తల్లి మమకారాన్ని పొందలేని జగదీశ్వర్ కష్టపడి చదివి విద్యావేత్తగా ఎదిగారు. ఇదే క్రమంలో 2006లో అమ్మ ఎడ్యుకేషన్ సెంటర్ ఏర్పాటుచేసి అక్షర పాఠశాల నెలకొల్పారు. నాటి నుంచి ఎంతో మంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించారు. అలాగే 2010లో అమ్మ సేవా సమితి నెలకొల్పి సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. అమ్మ సేవాసమితి, ఎడ్యుకేషన్ సెంటర్ లోగోలో బిడ్డను హత్తుకున్న తల్లి విగ్రహం ఉంటుంది. కరోనా కష్టకాలంలోనూ సేవాసమితి ద్వారా వందలాది మందికి నిత్యావసర సరుకులు, నగదు అందజేశారు. కానీ అనారోగ్యానికి గురైన జగదీశ్వర్ 2021, అక్టోబర్‌లో మృతిచెందారు. ఆయన మృతిచెందినా అతను నెలకొల్పిన అమ్మ సేవాసమితి, ఎడ్యుకేషన్ సెంటర్‌ను భార్య పడాల రేణుక నేటికీ ముందుండి నడిపిస్తూ విద్యారంగంలో ఎంతోమంది పేదలకు ఉచిత విద్యను అందిస్తూనే ఉన్నారు. అమ్మ ప్రేమ పొందలేని వ్యక్తి అమ్మను ఆకాశమంత ఎత్తు చూపించి పలువురికి ఆదర్శంగా నిలిచారు.

నిర్వహించిన సేవా కార్యక్రమాలు..

- మాతృ దినోత్సవం సందర్భంగా అమ్మ విలువ తెలియజేసే కరపత్రాల పంపిణీ



సునామి బాధితుల కోసం సేకరించిన విరాళాలు నాటి సీఎం వైఎస్‌ఆర్‌కు అందజేస్తూ.. (ఫైల్)

- పదోతరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు
- ఓటు హక్కుపై చైతన్య కార్యక్రమాలు
- సునామి బాధితులను ఆదుకునేందుకు విరాళాలు సేకరించి నాటి ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్‌కు అందజేత
- ప్రభుత్వ వసతిగృహ విద్యార్థులు దుస్తులపంపిణీ
- పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాల పంపిణీ
- ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ
- పది, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు
- వరద బాధితులకు దుస్తులు, బియ్యం సరఫరా
- కరోనా కాలంలో పేదలకు నిత్యావసర సరుకులు అందజేత
- కరోనా సమయంలో ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు నగదు, సరుకుల పంపిణీ
- ప్రజా సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడం

వీటితో పాటు మరెంతో మందికి ఆర్థిక సాయం, ఫీజులో రాయితీ

- ప్రభుత్వ ఆస్పత్రి వద్ద సిమెంట్ బెంచీల ఏర్పాటు

ఆయన చూపిన మార్గంలోనే..



మా ఆయన ప్రారంభించిన అమ్మ సేవాసమితి, ఎడ్యుకేషన్‌సెంటర్ కొనసాగించటంతో పాటు ఆయన ఆశయాలు కొనసాగిస్తాం. అమ్మపై ప్రేమతో అమ్మ పేరున కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. అందుకే ఆయన చూపిన మార్గంలోనే పయనిస్తాం.

– పడాల రేణుక, నిర్వాహకురాలు, మ్మ సేవాసమితి, ఎడ్యుకేషన్ సెంటర్

ఉపాధి పనుల్లో వేగం పెంచాలి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల్లో వేగం పెంచాలని ఏపీఓ విమల, టెక్నికల్ అసిస్టెంట్లను ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వేసవి దృష్ట్యా కూలీలకు ఇబ్బందులు కలగకుండా తగిన వసతులు కల్పించాలని సూచించారు. పురపాలికలతో పాటు గ్రామాల్లో డ్రెయినేజీలు నిర్మించిన తర్వాతే సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై తమ సొసైటీ తరఫున ముఖ్యమంత్రి, రవాణాశాఖ మంత్రి, కమిటీ సభ్యులకు శనివారం మెయిల్‌లో వినతిపత్రాలు పంపినట్లు చెప్పారు. రాష్ట్రంలోని 40 వేల ఆర్టీసీ కార్మికుల కుటుంబాలు ముఖ్యమంత్రి ప్రకటన కోసం ఎదురుచూస్తున్నాయని.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి తెలంగాణ ప్రభుత్వ రోడ్డు రవాణాశాఖగా మారుస్తారనే పూర్తి నమ్మకం ఉందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు సంపూర్ణ భద్రత కల్పించాలని, 2021, 2025 వేతన సవరణ అమలు చేయాలని, డీఏ ఏరియర్స్, 2017 పీఆర్సీ చెల్లించాలని, స్పెషల్ ఆఫ్ డ్యూటీలుగానే కొనసాగించాలని, పండుగలు, జూన్ 2న నేషనల్ ఆఫ్‌గా ప్రకటించాలని కోరారు.

ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం



సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కేంద్రంలోని ఎన్డీయే పాలనలో ప్రభుత్వరంగ సంస్థలు నిర్వీర్యమవుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ ఆరోపించారు. ఏఐటీయూసీ రూపొందించిన సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్లు, కరపత్రాలను శనివారం జిల్లా కేంద్రంలోని సురవరం వెంకట్రామారెడ్డి భవన్ ఎదుట ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 20 జరిగే దేశవ్యాప్త సమ్మెను పార్టీ తరఫున సంపూర్ణ మద్దతునిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఫాసిస్టు విధానాలకు ఆజ్యం పోస్తూ కార్మిక, కర్షక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను అమలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సురేష్, ఉపాధ్యక్షుడు ఎస్.దేవానంద్, సంఘం నాయకులు గోపాల్‌నాయక్, ఆంజనేయులు, యాదయ్య, శ్రీనివాస్, నరేష్, యాదగిరి, రమేష్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం బస్తాలు పడి హమాలీలకు గాయాలు

పాన్‌గల్: ధాన్యం బస్తాలు పడి హమాలీలకు గాయాలైన ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. బాధిత హమాలీలు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఈదమ్మ గుడి సమీపంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ధాన్యం కాంటా చేసి ధాన్యం బస్తాలను లారీలోకి లోడ్ చేస్తున్న క్రమంలో సామర్థ్యానికి మించి బస్తాలు ఎత్తడంతో ఒక్కసారిగా లారీ ఒక పక్కకు ఒరిగింది. దీంతో ధాన్యం బస్తాలు తెలుగు రాములు, యాదగిరిరెడ్డి, గొల్లరాములుపై పడటంతో తెలుగు రాములుకు కుడికాలు ఫ్యాక్చర్ కావడంతో మిగితా వారికి స్వల్ప గాయాలయ్యాయి.

బాలిక బలవన్మరణం

కొత్తకోట రూరల్: ఉరి వేసుకుని 13ఏళ్ల బాలిక మృతి చెందిన ఘటన కొత్తకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్ మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన భారతిని 25ఏళ్ల క్రితం పెబ్బేరు మండలం గుమ్మడం గ్రామానికి చెందిన వెంకటేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ప్రశాంతి (13), గణేష్ అనే ఇద్దరు సంతానం కలరు. భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా భారతి కొంతకాలంగా పిల్లలతో కలిసి కొత్తకోట పట్టణ కేంద్రంలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. చింతకుంట గ్రామానికి చెందిన సాయిబాబా అనే వ్యక్తితో కొంతకాలంగా భారతి సహజీవనం చేస్తోంది. ఈ క్రమంలో భారతి కుమార్తె ప్రశాంతి శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ప్రశాంతి మృతిపై అనుమానం ఉన్నట్లు మేనమామ రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నందివడ్డేమాన్‌కు పోటెత్తిన భక్తులు



బిజినేపల్లి: మండలంలోని నందివడ్డేమాన్‌లో వెలసిన జేష్ఠ్యాదేవి సమేత శనేశ్వరస్వామిని శనివారం శని త్రయోదశి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు. తమ ఏలినాటి శనిదోష నివారణకు పూజలు నిర్వహించారని ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తెలిపారు. భక్తులు ప్రత్యేకంగా నల్లటి వస్త్రాలు ధరించి శనేశ్వరునికి సంప్రదాయ పద్ధతిలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం బ్రహ్మసూత్ర పరమ శివుడిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా పీవీ రావు జయంతి



అంబేద్కర్ చౌరస్తాలో పీవీ రావుకు నివాళులు అర్పిస్తున్న మాల మహానాడు నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: మాలల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు పీవీ రావు అని మాల మహానాడు రాష్ట్ర ప్రధానకార్యదర్శి కానుగడ్డ యాదయ్య అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో పీవీ రావు జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎడ్ల కృష్ణయ్య, చెన్నయ్య, బాలరాజు, చెన్నకేశవులు, డబ్బ రాములు, గోకం చెన్నయ్య, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

- మాలల చైతన్య సమితి ఆధ్వర్యంలో..

మాలల చైతన్య సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మూలె కేశవులు ఆధ్వర్యంలో పీవీ రావు జయంతిని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ రావు చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పీవీ రావు రాష్ట్రవ్యాప్తంగా చైతన్య యాత్ర చేపట్టి రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేసిన ఉద్యమంలో అందరిని భాగస్వాములను చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లాల్‌కోట శ్రీనివాసులు, నాయకులు పత్తి యాదయ్య, వెంకట్రాములు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

- రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు



రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు

నవాబుపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు సూచించారు. శనివారం మండలంలోని కాకర్లపహాడ్‌లో కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారులు, రైతులతో మాట్లాడారు. సరిపడా గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే గోదాములు, రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మండల అధికారులు నిత్యం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం తీసుకొచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట మండల అధికారులు తదితరులు ఉన్నారు.

కరాటే శిక్షకులుగా ఎదగాలి



హోదా పొందిన మాస్టర్లతో కృష్ణయ్య తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులకు మెరుగైన శిక్షణనిచ్చి కరాటే శిక్షకులుగా తీర్చిదిద్దాలని జీకే మాస్టర్ షోటోకాన్ కరాటే ఇండియా ఫౌండర్ చీఫ్ జి.కృష్ణయ్య అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలో బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించి సీనియర్ కరాటే మాస్టర్ శివకుమార్‌కు నాలుగో డాన్, నవీన్‌కుమార్‌కు మూడో డాన్ హోదా కల్పించి బెల్టులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమ వద్ద శిక్షణ తీసుకున్న వేలాదిమంది విద్యార్థులు వివిధ బెల్టులతో పాటు మాస్టర్లుగా ఎదిగినట్లు గుర్తుచేశారు. చీఫ్ ఎగ్జామినర్, సీనియర్ మాస్టర్ రవికుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం కరాటే విద్యకు ఎంతో ప్రాధాన్యం ఏర్పడిందని, చిన్నారులు కరాటే శిక్షణ తీసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. జీకే మాస్టర్ షోటోకాన్ ఆధ్వర్యంలో నిరంతరం శిక్షణ కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు మాస్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి : బీజేపీ



రాపోతుల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

నవాబుపేట: గ్రామాల్లో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జడ్చర్ల ఇన్‌చార్జ్ రాపోతుల శ్రీనివాస్ కోరారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు పోలింగ్ కేంద్రాల వారీగా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జ్ రాపోతుల శ్రీనివాస్, జిల్లా నాయకుడు అర్జున్‌రెడ్డి, జిల్లా కార్యవర్గంలో చేరిన పార్టీ మండల మాజీ అధ్యక్షుడు రాజు, లోకిరేవు శ్రీనును నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు యాదయ్య, నరేందర్, శ్యాంసుందర్, బస్వరాజ్, రాజు, రామకృష్ణ, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



మన్యంకొండ సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీ నరసింహ(ఓబులేశు) స్వామి ఉత్సవాలను ఆదివారం నుంచి 13వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మూడురోజుల పాటు జరిగే ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారు. ఆదివారం శుద్ధి పుణ్యాహ వాచనం, రాత్రి హనుమద్‌వాహనసేవ, 12న మధ్యాహ్నం లక్ష్మీనరసింహస్వామి కల్యాణం, రాత్రి గరుడ వాహన సేవ, 13న వసంతోత్సవం, అవభృతస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు వివరించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. కల్యాణంలో పాల్గొనే దంపతులు రూ.వెయ్యి చెల్లిస్తే శేషవస్త్రాలు, కల్యాణ అక్షింతలు, ప్రసాదం అందజేస్తామని చెప్పారు.

మహిళ హత్య కేసు ఛేదన : నిందితుడి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన సీఐ

భూత్పూర్: మండలంలోని ఎల్కిచర్లకు చెందిన కొత్త గొల్ల నాగమ్మ హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. శనివారం సాయంత్రం పట్టణంలోని తన కార్యాలయంలో ఎస్‌ఐ చంద్రశేఖర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో హత్య వివరాలు వెల్లడించారు. ఎల్కిచర్లకు చెందిన కొత్త గొల్ల నాగమ్మ అదే గ్రామానికి చెందిన కట్టె పర్వతాలుతో ఏడాదిన్నరగా వివాహేతర సంబంధం కొనసాగిస్తుండటంతో తరుచూ ఇంటికి వచ్చి వెళ్తుండేవాడు. ఈ క్రమంలో పర్వతాలు తన కుమార్తె వివాహానికి నాగమ్మ వద్ద రూ.50 వేలు అప్పు తీసుకున్నాడు. అనారోగ్య సమస్యల కారణంగా కొన్నిరోజుల కిందట నాగమ్మ గర్భసంచిని తొలగించడంతో పర్వతాలును ఇంటికి రావద్దని, అలాగే డబ్బులు కూడా తిరిగి ఇవ్వాలని కోరింది. దీనిని మనసులో పెట్టుకున్న పర్వతాలు ఎలాగైనా నాగమ్మను హతమార్చాలని నిర్ణయించాడు. ఈ క్రమంలో గత శుక్రవారం రాత్రి నాగమ్మ పర్వతాలుకు ఫోన్‌చేసి ఇంటికి రమ్మనడంతో వెళ్లాడు. డబ్బుల విషయంలో ఇరువురి మధ్య గొడవ జరగగా.. కోపంతో పర్వతాలు తన వెంట తెచ్చుకున్న వేట కొడవలితో ఆమె గొంతు కోశాడు. పర్వతాలపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

కేంద్రం నిర్ణయం సరైంది



మహమ్మదాబాద్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన

మహమ్మదాబాద్: ఉగ్రవాదుల దాడులను వ్యతిరేకిస్తూ భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైందని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ తెలిపారు. ఉగ్రవాదులు అకారణంగా భారత యాత్రికులపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. యుద్ధంలో అసువులు బాసిన తెలుగుబిడ్డ మురళీనాయక్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు..

నవాబుపేట: శత్రువులను మట్టి కరిపించేలా భారత సైన్యానికి శక్తిని ఇవ్వాలని కోరుతూ మండలంలోని కొండాపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం రాఘవేంద్రాచారి ఆధ్వర్యంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదయ్య, రాఘవేందర్‌రెడ్డి, సాయిలు, వెంకటయ్య, రాములు, చంద్రశేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ విజయానికి ప్రత్యేక పూజలు..

కోయిల్‌కొండ: ఆపరేషన్ సిందూర్‌లో భారత్ విజయం సాధించాలంటూ శనివారం మండల కేంద్రంలోని ఆది ఆంజనేయస్వామి ఆలయంలో హిందూ యువజన బృందం ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం అక్కడి నుంచి స్వామి వివేకానంద చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా యుద్ధంలో అమరుడైన భారత జవాన్ మురళీనాయక్‌కు ఘనంగా నివాళులర్పించారు.



కోయిల్‌కొండలో ర్యాలీ ప్రారంభిస్తున్న హిందూ యువజన బృందం

మహమ్మదాబాద్‌లో..

మహమ్మదాబాద్: భారత్–పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధంలో వీర మరణం పొందిన మురళీనాయక్, సూరజ్‌యాదవ్, దినేశ్‌శర్మ, అమిత్‌చౌదరి ఆత్మకు శాంతి చేకూరాలంటూ శనివారం మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ శాంతిబాయి, వైస్ ఎంపీపీ రాధారెడ్డి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి నివాళులు అర్పించారు. తీవ్రవాదులకు మద్దతు పలికే పాకిస్తాన్‌ను ఎప్పటికీ క్షమించవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మాజీ కో–ఆప్షన్ సభ్యుడు రహీం, అక్బర్, వేణు, నర్సింహులు, పవన్, కేశవులు, సత్తయ్య, చెన్నయ్య, యువత పాల్గొన్నారు.

మురళీనాయక్‌కు ఘన నివాళి

మిడ్జిల్: పాకిస్తాన్ కాల్పుల్లో వీర మరణం పొందిన భారత జవాన్ మురళీనాయక్‌కు శనివారం సాయంత్రం మండల కేంద్రంలో అఖిల పక్షం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఆత్మకు శాంతి చేకూరాలంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు అల్వాల్‌రెడ్డి, గౌస్, నానునాయక్, శ్రీనునాయక్, తిరుపతి, నరేష్, భాస్కర్, బాలయ్య, ఉస్మాన్ పాల్గొన్నారు.